

పిడుగురాళ్లలో భారీ వర్షం

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణంలో సోమవారం గంటపాటు భారీ వర్షం కురిసింది. రైతులు, ప్రజలు సైతం ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



క్రికెట్‌లో మరింత రాణించాలి

నగరంపాలెం(గుంటూరు): క్రికెట్ పోటీల్లో మరింత రాణించాలని ఎస్పీ ఆరిఫ్‌హఫీజ్ అన్నారు. కార్పొరేట్ క్రికెట్ లీగ్-2023 విజేత జట్టు సోమవారం ఎస్పీని కలిసింది.



రైల్వేగేటును ఢీకొట్టిన ట్రాలీ ఆటో

మంగళగిరి: నగరంలోని నిడమర్రు రోడ్డులో ఉన్న రైల్వేగేటును ట్రాలీ ఆటో ఢీ కొట్టడంతో గంటకు పైగా వాహన రాకపోకలు నిలిచిపోయిన ఘటన సోమవారం చోటుచేసుకుంది.

న్యూస్‌రీల్

జూలై 22న ప్రత్యేక లోక్ అదాలత్

నరసరావుపేటటౌన్: మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జూలై 22వ తేదీన ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఒ.వెంకట నాగేశ్వరరావు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అదాలత్‌లో రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులతోపాటు సివిల్ కేసులు పరిష్కరించనున్నట్లు వివరించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని విలువైన సమయాన్ని వృథా కాకుండా కాపాడుకోవాలన్నారు.

యార్డుకు 53,233 బస్తాల మిర్చి



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 53,233 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 50,453 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.9,500 నుంచి రూ.24,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగి, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.24,500 వరకు పలికింది. ఏసీ కామన్ రకం మిర్చి క్వింటాల్‌కు రూ.11,000 నుంచి 24,000 వరకు ధర లభించింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.10,000 నుంచి రూ.24,200 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.14,000 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 13,351 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వర రెడ్డి తెలిపారు.


పల్నాడు కలెక్టరేట్‌లో ఎడ్యుకేషనల్ సెల్ ఏర్పాటు

నరసరావుపేట: జిల్లాలో పది, ఇంటర్మీడియెట్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థిని, విద్యార్థులకు సోమవారం నుంచి వారం రోజుల పాటు పైచదువులు చదువుకునేందుకు అవసరమైన సమాచారాన్ని అందించడంతోపాటు వారి సమస్యలను పరిష్కరించే విధంగా కలెక్టరేట్‌లో 'ఎడ్యుకేషన్ సెల్' ఏర్పాటుచేసినట్లు ఎల్.శివశంకర్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

వైఎస్సార్ సీపీలో నియామకాలు

పట్నంబజారు(గుంటూరుఈస్ట్): వైఎస్సార్ సీపీ అధినేత, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గుంటూరు పశ్చిమ నియోజకవర్గానికి చెందిన సింగ్ నరసింహారావును గుంటూరు జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. బాపట్ల జిల్లాకు సంబంధించి క్రిస్టియన్ మైనార్టీ సెల్ జోనల్ ఇన్‌చార్జిగా పట్టెం మనోహర్‌ను నియమిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 520.10 అడుగుల వద్ద ఉంది. ఇది 149.4580 టీఎంసీలకు సమానంగా ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎస్‌ఎల్‌బీసీకి 900 క్యూసెక్కులు విడుదలవుతోంది. దీంతో సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్ ఫ్లోగా 900 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి 900 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 809.10 అడుగుల వద్ద ఉంది. ఇది 33.8136 టీఎంసీలకు సమానం.

రేపు వైద్య సిబ్బందికి బదిలీ కౌన్సెలింగ్

గుంటూరుమెడికల్: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం పరిధిలో పనిచేస్తున్న వైద్య సిబ్బందికి జనరల్ ట్రాన్స్‌ఫర్స్ కౌన్సెలింగ్ బుధవారం నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు తెలిపారు. లాంగ్‌స్టాండ్ అభ్యర్థుల వివరాలు, రిక్వెస్ట్ బదిలీ కోరుకున్న వారి వివరాలన్నీ గుంటూరు.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామన్నారు. అన్ని క్యాడర్ల అభ్యర్థులు కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని తెలిపారు.

వైద్యం అప్‌గ్రేడ్



ఆస్పత్రిలో కొత్తగా నిర్మించిన ఓపీ విభాగ భవనం



కొత్తగా నిర్మించిన డయాగ్నస్టిక్ విభాగం

మాచర్ల ఆస్పత్రికి మహర్దశ

- 50 పడకలకు అప్‌గ్రేడ్
- రూ.3 కోట్లతో భవనాల నిర్మాణం
- నేడు ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు పూర్తి

మాచర్ల: వెనుకబడిన ప్రాంతమైన మాచర్లలో గతంలో వైద్యం అందక ప్రజలు విలవిల్లాడేవారు. 30 పడకల ప్రభుత్వాస్పత్రి ఉన్నా.. వైద్యుల కొరత తీవ్రంగా వెంటాడేది. వసతుల్లేక ప్రజలు చీటికీమాటికీ వేలాది రూపాయలు ఖర్చు చేసి గుంటూరుకు పరుగులు పెట్టేవారు. అయితే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టాక, ప్రభుత్వ విప్ స్థానిక ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి(పీఆర్కే) చొరవతో ప్రభుత్వాస్పత్రి రూపురేఖలే మారిపోయాయి. సకల వసతులూ సమకూరాయి. వైద్యుల నియామకం జరిగింది. ఫలితంగా ప్రజలకు మెరుగైన వైద్యం అందుబాటులోకి వచ్చింది. ఓపీ గణనీయంగా పెరిగింది. దీంతో ప్రభుత్వ విప్ పీఆర్కే ఆస్పత్రిని అప్‌గ్రేడ్ చేయాలని భావించారు. 30 పడకల నుంచి 50 పడకల ఆస్పత్రి స్థాయికి తీసుకెళ్లాలని రెండేళ్ల కిందట సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి విన్నవించారు. అడిగిందే తడవుగా సీఎం ఆస్పత్రిని అప్‌గ్రేడ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. 50 పడకల ఆస్పత్రి నిర్మాణం కోసం రూ.3 కోట్లు మంజూరు చేశారు. ఏడాదిన్నర కింద భవన నిర్మాణ పనులు చేపట్టి చకచకా పూర్తిచేశారు. సూపర్ స్పెషాలిటీ వసతులు కల్పించారు. ఈ ఆస్పత్రి మాచర్ల పరిసరాల్లోని 70 గ్రామాల ప్రజలకు ఉపయోగపడుతుంది.



ఆస్పత్రి భవనాల లోపలి భాగం

సమకూరిన వసతులివీ..

- 500ల మంది చూపించుకునే విధంగా 18 గదులతో ఓపీ విభాగం నిర్మితమైంది.
- ప్రత్యేకంగా డయాగ్నోసిస్ సెంటర్ మంజూరైంది. దీనికోసం 12 గదులతో భవనం నిర్మించారు.
- 50 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ కావడంతో ప్రస్తుతం ఉన్న ఏడుగురు వైద్యులకు అదనంగా స్పెషాలిటీ వైద్యులను నియమించనున్నారు. చెవి, ముక్కు, గొంతు వైద్య స్పెషలిస్టులతోపాటు ఆప్తమాలజిస్టు, ఆర్థోపెడిక్, మరో ఐదుగురు ప్రత్యేక వైద్యులను కేటాయించనున్నారు. మొత్తం 44 మంది వైద్య సిబ్బందితో ఆస్పత్రి పనిచేయనున్నది.
- ల్యాబ్, ఎక్స్‌రే, అన్ని వైద్య పరీక్షల సదుపాయాలు అందుబాటులో ఉన్నాయి.
- పాత వైద్యశాల భవనాన్ని ఇన్‌పేషెంట్ల కోసం కేటాయించారు.

నేడు ప్రారంభోత్సవం

ఆస్పత్రి కొత్త భవనాలను మంగళవారం ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, నర్సరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, కలెక్టర్ ఎల్.శివశంకర్, వైద్య శాఖ కార్యదర్శులు, డీఎంహెచ్‌ఓలు హాజరుకానున్నారు. ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ప్రారంభోత్సవం జరగనుంది.

ఆనందంగా ఉంది



నేను సూపరింటెండెంట్‌గా ఉండగా 50 పడకల ఆస్పత్రి ప్రారంభం కావడం ఆనందంగా ఉంది. వెనుకబడిన ప్రాంతంలో ప్రజలందరికీ ఉచితంగా వైద్యమందించేందుకు కృషి చేస్తాం. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి ప్రజల తరఫున కృతజ్ఞతలు.

– కృష్ణమూర్తి, ఆసుపత్రి సూపరింటెండెంట్

సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు



నేను 2009 నుంచి ఎమ్మెల్యేగా ప్రభుత్వాస్పత్రిని గమనించాను. వైఎస్సార్ హయాంలో వైద్యం బాగానే అందేది. వసతులూ బాగుండేవి. గత ప్రభుత్వ హయాంలో సరైన సదుపాయాలు లేవు. వైద్యం అందక ప్రజలు అల్లాడిపోయారు. ఈ ఆస్పత్రిని 50 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాను. అడిగిందే తడవుగా ఆయన ఆస్పత్రిని అప్‌గ్రేడ్ చేసి రూ.3 కోట్లు కేటాయించారు. భవన నిర్మాణాలు పూర్తయ్యాయి. చాలా ఆనందంగా ఉంది. సీఎంకు ప్రత్యేక కృతజ్ఞతలు.

– పిన్నెల్లి రామకృష్ణారెడ్డి(పీఆర్కే), ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే

జూలై మొదటి వారంలో వరికపూడిసెలకు శంకుస్థాపన



మాచర్ల: జూలై మొదటి వారంలో వరికపూడిసెల పథకానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన చేయనున్నట్లు ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ విప్ పీఆర్కే విలేకరులతో మాట్లాడారు. వరికపూడిసెల ప్రాజెక్టు శంకుస్థాపన స్థలాన్ని పరిశీలించేందుకు మంత్రి, ఎంపీతోపాటు మంగళవారం వెళ్లనున్నట్లు వెల్లడించారు. ఇదిలా ఉంటే ప్రభుత్వ ఆస్పత్రి ప్రారంభోత్సవ ఏర్పాట్లను వైఎస్సార్ సీపీ యువజన విభాగం మూడు జిల్లాల కో-ఆర్డినేటర్ పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి పర్యవేక్షిస్తున్నారు.

క్రీడాపాఠశాల ప్రవేశాలకు జిల్లా స్థాయి ఎంపికలు

నరసరావుపేట ఈస్ట్: వైఎస్సార్ కడప జిల్లాలోని డాక్టర్ వైఎస్సార్ క్రీడా పాఠశాలలో నాలుగు, ఐదు తరగతులలో ప్రవేశాలకు జిల్లాస్థాయి ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు పల్నాడు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ సీఈఓ ఎస్.పల్లవి, చీఫ్ కోచ్ పి.అఫ్రోజ్‌ఖాన్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 20వ తేదీ వరకు జరిగే మండలస్థాయి పోటీలలో ఎంపికైన అభ్యర్థులకు ఈనెల 23, 24తేదీల్లో జిల్లాస్థాయి ఎంపికలు సత్తెనపల్లిరోడ్డులోని డీఎస్‌ఏ స్టేడియంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాస్థాయిలో ఎంపికైన అభ్యర్థులను ఈనెల 29, 30తేదీల్లో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం క్రీడా ప్రాంగణంలో జరగనున్న రాష్ట్రస్థాయి ఎంపికలకు పంపనున్నట్లు వివరించారు. నాలుగవ తరగతి ప్రవేశం కోరే అభ్యర్థులు 2014 ఆగస్టు 1వ తేదీ నుంచి 2015 జులై 31వ తేదీలోపు జన్మించి 3వ తరగతి పూర్తిచేసి ఉండాలన్నారు. ఐదో తరగతికి 2013 ఆగస్టు 1వ తేదీ నుంచి 2014 జులై 31వ తేదీలోగా జన్మించి ఉండాలని తెలిపారు. అభ్యర్థులు తమ జనన ధ్రువీకరణ పత్రం, విద్య, కుల, ఆదాయ, ఆధార్ పత్రాలతోపాటు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో హాజరు కావాలని కోరారు.

బల్లికురవ ఎంఈఓ సస్పెన్షన్

బల్లికురవ: ఉపాధ్యాయులను వేధింపులకు గురిచేస్తూ ప్రతి పనికి సొమ్ము డిమాండ్ చేస్తున్న బల్లికురవ ఎంఈఓ బీ.వీరరాఘవయ్యపై పాఠశాల విద్య గుంటూరు ఆర్జేడీ సుబ్బారావు సోమవారం సస్పెన్షన్ వేటు విధించారు. అక్రమ డిప్యూటేషన్‌లు, తుఫాన్‌ల పేరిట వసూళ్లు ఉపాధ్యాయుల ఎల్‌ఐసీ ప్రీమియంలు కార్యాలయానికి పంపడంలో జాప్యం, ఉపాధ్యాయులు శిక్షణ సొమ్ము స్వాహా, కార్యాలయ ఖర్చుల పేరిట వసూళ్లు, విశ్రాంత ఉపాధ్యాయుల పెన్షన్ చెల్లింపులో చేతివాటం ప్రదర్శించారని యూటీఎఫ్ నేతలు జిల్లా కలెక్టర్, ఆర్జేడీ, డీఈవోలకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులపై గత నెల 20వ తేదీ స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో ఆర్జేడీ విచారణ చేపట్టారు. విచారణలో పలువురు ఉపాధ్యాయులు విశ్రాంత ఉపాధ్యాయులు వీరరాఘవయ్య అవినీతిపై లిఖితపూర్వకంగా వివరించారు. విచారణ అనంతరం ఆర్జేడీ సస్పెన్షన్ వేటు వేశారు.

విద్యుక్త ధర్మం

- విద్యాశాఖలో క్షేత్రస్థాయి పర్యవేక్షణకు సర్కారు పెద్దపీట
- మండలానికి ఇద్దరు ఎంఈఓలు చొప్పున నియామకం
- ఒకరు పరిపాలనకు, మరొకరు పర్యవేక్షణకు..
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో కొత్తగా కొలువుదీరిన 57 మంది ఎంఈఓ-2లు
- ప్రభుత్వ చారిత్రాత్మక నిర్ణయంతో ఉపాధ్యాయవర్గాల్లో హర్షాతిరేకాలు
- గ్రేడ్-2 హెచ్ఎం పోస్టుల్లో స్కూల్ అసిస్టెంట్లకు ఉద్యోగోన్నతులు

గుంటూరు ఎడ్యుకేషన్: క్షేత్రస్థాయిలో అత్యంత కీలకమైన మండల విద్యాశాఖాధికారుల(ఎంఈఓల)కు విధి నిర్వహణలో ఎదురవుతున్న ఇబ్బందులు, పని ఒత్తిడి నుంచి ఉపశమనం కలిగించేందుకు ప్రభుత్వం చారిత్రాత్మకమైన నిర్ణయం తీసుకుంది. రెండో ఎంఈఓ పోస్టులను సృష్టించింది. ఆ మేరకు నియామక ప్రక్రియ కూడా పూర్తి చేసింది. ఫలితంగా ఉపాధ్యాయ వర్గాల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

తగ్గనున్న పనిఒత్తిడి

క్షేత్రస్థాయిలో పాఠశాలల పర్యవేక్షణ, విద్యారంగ కార్యక్రమాల అమలు, కార్యాలయ వ్యవహారాలతో ఎంఈఓలపై తీవ్ర పనిఒత్తిడి ఉంది. దీనిని గుర్తించిన సర్కారు రెండో ఎంఈఓ నియామకానికి శ్రీకారం చుట్టింది. దీనివల్ల ఒకరు క్షేత్రస్థాయి పాఠశాలలపై పర్యవేక్షణతో విద్యారంగ కార్యక్రమాల అమలు పనులు నిర్వర్తిస్తే మరొకరు పరిపాలన కార్యక్రమాలు చూసే అవకాశం కలుగుతుంది. ఫలితంగా పనిభారం తగ్గుతుంది.

ఒక్కపోస్టు మినహా భర్తీపూర్తి

ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 57 మండలాలతో పాటు గుంటూరు నగర పరిధిలో అదనంగా మరొక పోస్టును కలుపుకుని మొత్తం 58 ఎంఈఓ-2 పోస్టులను ప్రభుత్వం మంజూరు చేసింది.




ఎంఈఓ కార్యాలయం, గుంటూరు (ఫైల్)

ఆదివారం గుంటూరులోని డీఈఓ కార్యాలయంలో ఆర్జేడీ వీఎస్ సుబ్బారావు, డీఈఓ పి.శైలజ ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ఒక్క వెల్దుర్తి మండలం మినహా మిగిలిన 57 మండలాల్లో ఎంఈఓ-2ల నియామకాన్ని కౌన్సెలింగ్ ద్వారా పూర్తి చేశారు.

ప్రయోజనాలు ఇవీ..

- ఇద్దరు ఎంఈఓల విధానం వల్ల క్షేత్రస్థాయి పర్యవేక్షణ సులభతరమవుతుంది.
- విద్యాపథకాలు జగనన్న అమ్మఒడి, విద్యాకానుక, గోరుముద్ద, మనబడి నాడు-నేడు కార్యక్రమాలు సమర్థంగా అమలవుతాయి.
- ప్రైవేటు పాఠశాలల గుర్తింపు, రెన్యూవల్ అనుమతులు, వాటిపై నియంత్రణ సాధ్యమవుతుంది.
- ఉపాధ్యాయుల నెలవారీ వేతన బిల్లుల సమర్పణ, ఉన్నతాధికారుల నుంచి వచ్చే ఆదేశాలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు సమాచారాన్ని పంపడం, కార్యాలయంలో ఆన్‌లైన్ పనులు సులభతరమవుతాయి.
- ఒకరు పర్యవేక్షణ, మరొకరు పరిపాలన వ్యవహారాలు నిర్వర్తించే వెసులుబాటు ఉంటుంది.
- ఎంఈఓ-2 పోస్టుల భర్తీ వల్ల ఖాళీ అయిన హెచ్ఎం గ్రేడ్-2 పోస్టులను సీనియారిటీ ప్రాతిపదికన స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులతో ఉద్యోగోన్నతుల ద్వారా భర్తీ చేయనున్నారు. ఫలితంగా ఉపాధ్యాయవర్గాల్లో ఆనందం వెల్లువెత్తుతోంది.

ఇదో కొత్త ఒరవడి



రెండో ఎంఈఓల పోస్టులను మంజూరు చేయడం కొత్త ఒరవడి. చారిత్రాత్మక నిర్ణయం. ఇకపై విద్యా వ్యవహారాలు వేగవంతమవుతాయి. సమస్యలు సత్వరం పరిష్కారమవుతాయి. మంచి పరిణామం.

– యేరువ థామస్‌రెడ్డి, వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్, జిల్లా అధ్యక్షుడు

సర్వీసు రూల్స్ పరిష్కారానికి కృషి భేష్



ఉపాధ్యాయుల ఉమ్మడి సర్వీసు రూల్స్‌ను పరిష్కరించడంలో గత ప్రభుత్వం విఫలమైంది. ప్రభుత్వ, జెడ్పీ యాజమాన్యాలకు చెందిన ఉపాధ్యాయులకు ఏకీకృత సర్వీసు రూల్స్‌ను పరిష్కరించేలా సీఎం వైఎస్ జగన్ నేతృత్వంలోని ప్రభుత్వం కృషి చేయడం మంచి పరిణామం. రెండో ఎంఈవో పోస్టుల ద్వారా ఎంఈఓలపై పనిభారం తగ్గుతుంది.

– బి. తిరుపాల్, ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు

అర్జీల పరిష్కారం వేగవంతం

- కలెక్టర్ శివశంకర్
- 'స్పందన'కు 510 అర్జీలు
- ప్రజలతో కిటకిటలాడిన కలెక్టరేట్



అర్జీదార్లతో మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్, జాయింట్ కలెక్ట్ శ్యామ్‌ప్రసాద్

నరసరావుపేట: జిల్లాలో జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమానికి వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ఎల్.శివశంకర్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా నలుమూలల నుంచి పెద్దఎత్తున తరలివచ్చిన ప్రజలు 510 అర్జీలను అందజేశారు. ప్రజలతో కలెక్టరేట్ ప్రాంగణం కిటకిటలాడింది. కలెక్టర్‌తోపాటు జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్, జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు అర్జీలను స్వీకరించి సమస్యల పరిష్కారానికి చర్యలను తీసుకుంటామని భరోసా ఇచ్చారు. పల్నాడు జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ తరఫున గుంటూరుకు చెందిన రుద్ర కార్పొరేట్ సర్వీసెస్ అధినేత ఏనుగంటి వెంకటరత్నం అన్నదానం నిర్వహించారు. అన్నదాతను అధికారులు సత్కరించారు. రికార్డు స్థాయిలో అర్జీలను అధికారులు స్వీకరించడం గమనార్హం. ముఖ్యమైన అర్జీలు కొన్ని..

పిల్లలు చూడటం లేదు



నాకు నలుగురు పిల్లలు. నేను కష్టపడి కట్టుకున్న ఇంటిని ముగ్గురు పిల్లలు ఆక్రమించి నన్ను చూడటం లేదు. నా భార్య చనిపోయింది. మేము చెప్పినట్లుగా ఒక మూలన పడి ఉండమని చెబుతున్నారు. కనీస ఖర్చులకు డబ్బులు ఇవ్వట్లేదు.

– షేక్ అహ్మద్, గుర్రాలచావిడి, చిలకలూరిపేట

పొలం అమ్మినందుకు అన్నం పెట్టడం లేదు



చేసిన అప్పు తీర్చేందుకు పొలం అమ్మాననే కారణంతో కుమారులు నాకు అన్నం పెట్టడం లేదు. గ్రామంలో 4.20 ఎకరాల పొలం ఉంది. రూ.4 లక్షల అప్పు ఉంది. అప్పు తీర్చేందుకు 70 సెంట్ల భూమి విక్రయించాను. దీనికి, తమకు సంబంధం లేదంటూ పిల్లలు అన్నం పెట్టడం లేదు.

– సంగన పరమేశ్వరమ్మ, కొత్తపల్లి, రొంపిచర్ల మండలం

దుమ్ముధూళితో అల్లాడుతున్నాం



మా గ్రామంలో ఏడు స్టీమ్ రైస్‌మిల్లుల నుంచి వచ్చే దుమ్ముధూళితో అల్లాడిపోతున్నాం. పంటలు దెబ్బతింటున్నాయి. శ్వాసకోశ జబ్బులు వస్తున్నాయి. యజమానులకు చెబితే దుమ్ము రాకుండా చూస్తామంటారే కానీ సమస్య పరిష్కారం కావట్లేదు. దయచేసి సమస్యను పరిష్కరించండి.

– ముప్పా వెంకటరెడ్డి, రమణారెడ్డి, శ్రీనివాసరెడ్డి, మరో 20మంది రైతులు, మానుకొండవారిపాలెం, చిలకలూరిపేట మండలం

చేనేత వస్త్ర పరిశ్రమ సమస్యను పరిష్కరించండి



జిల్లాలో చేనేత వస్త్ర పరిశ్రమ కార్మికుల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించాలి. నూలు, జరీ, పట్టు రంగులు, రసాయనాలు సబ్సిడీపై అందజేయాలి. జీఎస్టీ పూర్తిగా రద్దుచేయాలి. 11రకాల వస్త్ర ఉత్పత్తి రిజర్వేషన్ కఠినంగా అమలుచేయాలి. చేనేతలకు బడ్జెట్‌ను రూ.200 కోట్ల నుంచి రూ.2వేల కోట్లకు పెంచాలి.

– ఏపీ చేనేత ఐక్యకార్యాచరణ కమిటీ నాయకులు (తొలుత కలెక్టరేట్ వద్ద చేనేత నాయకులు ప్రదర్శన నిర్వహించారు.)

పాఠ్యపుస్తకాల పంపిణీ వందశాతం పూర్తి



గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాల పంపిణీ ప్రక్రియ నూరు శాతం పూర్తయింది. ఈనెల 12న పాఠశాలల పునఃప్రారంభం నాటికి 93 శాతంగా ఉన్న పాఠ్య పుస్తక పంపిణీ వారం రోజుల వ్యవధిలో నూరుశాతానికి చేరుకుంది. రాష్ట్రంలోని వివిధ ముద్రణా సంస్థల నుంచి వేసవి సెలవుల్లోనే పాఠ్య పుస్తకాల పంపిణీ చేపట్టిన ప్రభుత్వం ఉమ్మడి గుంటూరు జిల్లాకు అవసరమైన పుస్తకాలను సకాలంలో అందజేసింది. విద్యార్థులకు జగనన్న విద్యాకానుక స్టూడెంట్ కిట్లతో కలిపి పాఠ్య పుస్తకాలను పంపిణీ చేస్తున్నారు. 2023-24 విద్యాసంవత్సరానికి ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 3,607 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల వారీగా 4,18,678 మంది విద్యార్థులకు అవసరమైన 30,67,307 పాఠ్య పుస్తకాలు జిల్లాకు చేరాయి. వీటిని మండల స్టాక్ పాయింట్లకు ఆర్టీసీ కార్గో బస్సుల్లో తరలించినట్లు జిల్లా ప్రభుత్వ పాఠ్య పుస్తక మేనేజర్ వి.వజ్రబాబు సోమవారం చెప్పారు.

త్వరలో సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్లు

జాయింట్ కలెక్టర్ రాజకుమారి

తుమ్మలపాలెం (ప్రత్తిపాడు): భూముల రీ సర్వే జరిగిన గ్రామాల్లోని సచివాలయాల్లో వచ్చేనెల ఒకటో తేదీ నుంచి రిజిస్ట్రేషన్ సేవలు అందుబాటులోకి రానున్నాయని జాయింట్ కలెక్టర్ రాజకుమారి చెప్పారు. ఇటీవలే తుమ్మలపాలెం సచివాలయం పరిధిలోని కొండజాగర్లమూడిలో భూముల రీసర్వే ప్రక్రియ పూర్తయింది. ఈ నేపథ్యంలో తుమ్మలపాలెం గ్రామ సచివాలయాన్ని సోమవారం జేసీ రాజకుమారి పరిశీలించారు. రిజిస్ట్రేషన్ సేవలు అందించేందుకు సచివాలయ సిబ్బంది సిద్ధంగా ఉండాలని సూచించారు. అనంతరం వీలునామా రిజిస్ట్రేషన్ చేయించుకున్న షేక్ శిలార్‌కు డాక్యుమెంట్‌ను జేసీ చేతుల మీదుగా అక్కడికక్కడే అందజేశారు. అనంతరం జేసీ మాట్లాడుతూ ఇప్పటికే సచివాలయాల్లో 545 సేవలు సమర్థంగా అందుతున్నాయని, త్వరలో అదనంగా మరో నాలుగు సేవలు ప్రారంభించనున్నట్లు వివరించారు. సేల్, మార్ట్‌గేజ్, వీలునామా, గిఫ్ట్ డీడ్ వంటి అన్ని రకాల రిజిస్ట్రేషన్ సేవలూ ఇకపై పొందొచ్చని చెప్పారు. సిబ్బంది సమర్థంగా పనిచేయాలని సూచించారు. జేసీ వెంట జిల్లా రిజిస్ట్రార్ శైలజ, డీపీఓ ఆర్.కేశవరెడ్డి, సబ్ రిజిస్ట్రార్ కోటేశ్వరరావు, ఎంపీడీఓ శ్రీరమ్య, ఈవోపీఆర్డీ మావులూరి మోషె తదితరులు ఉన్నారు.



వీలునామా రిజిస్ట్రేషన్ దస్తావేజును శిలార్‌కు అందిస్తున్న జేసీ రాజకుమారి

నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం క్వింటా నిమ్మకాయల కనిష్ఠ ధర రూ.1,600, గరిష్ఠ ధర రూ.2,700, మోడల్ ధర రూ.2,100 వరకు పలికింది.

తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు

- జిల్లా కలెక్టర్ శివశంకర్
- ముగ్గురు రైతులకు సన్మానం



రైతులను సన్మానించి అభినందిస్తున్న జిల్లా కలెక్టర్ శివశంకర్, జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్, అధికారులు

నరసరావుపేట: ఆధునిక సాంకేతిక పద్ధతుల్లో తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించిన రైతులు అభినందనీయులని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో రైతుకు వందనం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. రైతులకు ఆదర్శంగా నిలిచిన సత్తెనపల్లి మండలానికి చెందిన ముగ్గురు రైతులను సన్మానించి ప్రశంసాపత్రాలను అందజేశారు. సన్మానం పొందిన రైతుల వివరాలు...అబ్బూరు గ్రామానికి చెందిన మండవ వెంకటేశ్వరరావు 2.25 ఎకరాల విస్తీర్ణంలో రూ.5లక్షల వ్యయంతో బొప్పాయి పంట సాగుచేసి ఎకరానికి రూ.4.5లక్షలు ఆదాయం పొందారు. సాధారణంగా 25 టన్నుల దిగుబడి మాత్రమే వచ్చే బొప్పాయి సాగులో డ్రిప్, రైస్డు బెడ్ విధానంతో సేంద్రియ ఎరువులను వాడి ఎకరానికి రూ.60 టన్నుల దిగుబడి సాధించారు. అలాగే కొమెరపూడికి చెందిన జంగా బ్రహ్మానందరెడ్డి అనే రైతు 2.75ఎకరాల్లో ఎస్‌పిఎస్–72రకం మిరప వేసి 150 క్వింటాళ్ల దిగుబడి సాధించారు. ఈ రైతు ఎకరానికి రూ.3లక్షలు ఖర్చు చేసి మొత్తం పొలానికి రూ.9లక్షలు పొందాడు. గోరంట్ల గ్రామానికి చెందిన నందిగామ యల్లమందయ్య రూ.2.5లక్షల పెట్టుబడితో ఒక ఎకరం మిరపవేసి 40క్వింటాళ్ల దిగుబడి సాధించి మొత్తం రూ.7.20లక్షల ఆదాయం పొందారు. వీరు నూతన హైబ్రీడ్ విత్తనం అర్క సాన్వి ఎంపిక చేసుకొని సమగ్ర సస్యరక్షణ చర్యలతో జీవన సిలీంద్ర నాశనాలు, వేప పిండి వేసి నాణ్యమైన మిరప పంటను సాధించారు. వీరు అనుసరించిన సేంద్రియ సాగు విధానాలను తెలుసుకొని మిగతా రైతులు తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించాలని జిల్లా కలెక్టర్ కోరారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఏ శ్యాంప్రసాద్, డీఆర్వో కె.వినాయకం, ఉద్యాన అధికారి బీజే బెన్నీ పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ సేవా మిత్రలకు అవార్డులు

డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో పనిచేస్తున్న ఆరోగ్యమిత్రాలను ప్రోత్సహించటం కోసం రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న అవార్డుల్లో భాగంగా ఏప్రిల్, మే నెలలకు గాను సేవా మిత్ర అవార్డులను సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ ఎల్.శివశంకర్ అందజేశారు. జిల్లాలో పనిచేస్తూ అవార్డుకు ఎంపికైన ఆరోగ్యమిత్రాలు సత్తెనపల్లి బాజీ, షేక్ హసన్‌లకు జిల్లా జాయింట్‌కలెక్టర్ ఏ శ్యామ్‌ప్రసాద్‌తో కలసి అవార్డుతో పాటు రూ.5వేలు నగదు అందజేశారు. జిల్లా ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్ డాక్టర్ పి.సునీల, ఆరోగ్యశ్రీ సిబ్బంది పాల్గొన్నారు.

డీకే పట్టా అందజేత

చిలకలూరిపేట మండలం, పోతవరం గ్రామానికి చెందిన షేక్ ఖాదర్బా భార్య చాన్‌బీ పేరున సర్వే నంబరు 40–1హెచ్2లో 50సెంట్ల భూమిని వ్యవసాయ సాగు నిమిత్తం డీకే పట్టాను జిల్లా కలెక్టర్ శివశంకర్ మంజూరు చేశారు. కలెక్టరేట్‌లో సోమవారం డీకే పట్టాను లబ్ధిదారునికి అందజేశారు. తమ విన్నపాన్ని మన్నించి వ్యవసాయ సాగు కోసం భూమిని అందజేసిన జిల్లా కలెక్టర్‌కు లబ్ధిదారుడు కృతజ్ఞతలు తెలిపారు.

సంక్షేమం, అభివృద్ధి పనులు..

పల్నాడు జిల్లాలో ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి పథకాల వేగాన్ని మరింతగా పెంచాలని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో సంబంధిత శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రధానంగా మండల ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో ప్రభుత్వ పథకాల నిర్వహణపై చర్చించారు. ఈనెల 23వ తేదీ నుంచి జూలై 23 వరకు జగనన్న సురక్ష కార్యక్రమం ప్రారంభోత్సవం జరగబోతున్న దృష్ట్యా అధికారులంతా భాగస్వాములు కావాలని కోరారు.

తండా విద్యార్థులకు రూ.లక్ష ఆర్థిక సహాయం

పదోతరగతి, ఇంటర్మీడియెట్‌లలో ప్రతిభ చూపించిన ఇద్దరు విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.50వేలు చొప్పున జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ సొంత డబ్బులు అందజేశారు. కలెక్టరేట్‌లో సోమవారం మాచర్ల మండలం చింతల తండాకు చెందిన పదోతరగతిలో అత్యధిక మార్కులు సాధించిన బాలూనాయక్ కుమారుడు విద్యార్థి రమావత్ నగేష్, అదే విధంగా ఎన్ఐటీ సీటు సంపాదించిన బద్యానాయక్ కుమారుడు రామావత్ వినోద్ నాయక్‌లకు పాఠ్యపుస్తకాలు కొనుగోలు, ఇతర ఖర్చుల నిమిత్తం సాయం అందజేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఏ శ్యామ్‌ప్రసాద్ పాల్గొన్నారు.

వృద్ధురాలిపై లైంగిక దాడికి యత్నం

దాచేపల్లి: వృద్ధురాలిపై లైంగిక దాడికి యత్నించిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు.. దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలోని అంజనాపురం కాలనీలో 70 ఏళ్ల వృద్ధురాలు ఒంటరిగా ఉంటోంది. వృద్ధురాలి ఇంటికి సమీపంలో పిచ్చయ్య(55) నివసిస్తున్నాడు. లైంగిక దాడికి ప్రయత్నించాడు. ఆమె కేకలు వేయటంతో పిచ్చయ్య పారిపోయాడు. జరిగిన ఘటన గురించి వృద్ధురాలు కుటుంబ సభ్యులకు తెలిపింది. విషయం తెలుసుకున్న ఎస్ఐ సంధ్యారాణి వృద్ధురాలితో మాట్లాడారు. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇదిలా ఉండగా ఘటన గురించి బాధితురాలి నుంచి పోలీసులకు ఫిర్యాదు అందకపోవటంతో కేసు నమోదు చేయలేదు.

భార్యను హతమార్చిన భర్త అరెస్ట్



కార్తీక్‌ను అరెస్ట్ చూపుతున్న సీఐ శోభన్‌బాబు, సిబ్బంది

సత్తెనపల్లి: భార్యను హతమార్చిన భర్తను పట్టణ పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. పట్టణ సీఐ యు.శోభన్‌బాబు తెలిపిన వివరాలు.. పట్టణంలోని రెండో వార్డు 11వ లైన్‌లోని ఒంటిపులి అరుణపై అనుమానంతో ఆమె భర్త ఒంటిపులి కార్తీక్ ఈ నెల 7న అర్ధరాత్రి ఒంటి గంటకు గొంతు నులిమి హతమార్చాడు. దీనిపై కేసు నమోదు చేయగా సోమవారం నిందితుడి అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించటంతో నరసరావుపేట సబ్ జైలుకి తరలించారు.

టీడీపీ నాయకుడి నుంచి రక్షణ కల్పించండి

'టీడీపీ యువ నాయకుడు ఆర్.జ్ఞాని, అతడి తండ్రి వద్ద ఎనిమిదేళ్లుగా డ్రైవర్‌గా పనిచేశా. జ్ఞాని తాగి పదే పదే వేధిస్తుండడంతో అతడి వద్ద ఉద్యోగం చేయలేక మానుకొని టీ పాయింట్ పెట్టుకొని జీవిస్తున్నా. ఈనెల 8న తన కొందరితో పిలిపించి తీవ్రంగా కొట్టారు. కంటిపై కొట్టడంతో చూపు తగ్గింది. ఊళ్లో ఉంటే చంపుతారనే భయంతో ఊరొదిలి వెళ్లా. ఊర్లోకి ఈ నెల 18న రావడంతో మళ్లీ తన మనుషులను పంపి కొట్టించాడు. అన్న రమ్మంటున్నాడంటూ బలవంతంగా ద్విచక్ర వాహనంపై ఎక్కించుకొని తీసుకెళుతుండగా తప్పించుకొని పారిపోయాను. నాకు రక్షణ కల్పించాలి' అని నరసరావుపేటకు చెందిన డ్రైవర్ సయ్యద్ బాజాని ఎస్పీకి విన్నవించారు.

- ఎస్పీ స్పందనలో ఓ డ్రైవర్ అర్జీ
- జిల్లా పోలీసు స్పందనలో 82 ఫిర్యాదులు స్వీకరణ

నరసరావుపేట: ప్రతి ఫిర్యాదుదారుని సమస్యపై శ్రద్ధ వహించి నిర్ణీత గడువులోగా సదరు ఫిర్యాదులను పరిష్కరించేందుకు కృషి చేయాలని జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాంలో ప్రజల నుంచి కుటుంబ, ఆర్థిక, ఆస్తి తదితర తగాదాలకు సంబంధించి 82 ఫిర్యాదులను స్వీకరించారు. ఏఆర్ అదనపు ఎస్పీ డి.రామచంద్రరాజు, క్రైమ్ అదనపు ఎస్పీ ఎస్‌కే చంద్రశేఖర్, డీఎస్పీలు కె.వి మహేష్, పల్లపురాజు, దిశ డీఎస్పీ యు.రవిచంద్ర పాల్గొన్నారు. సమస్యలు విన్నవించుకునేందుకు వచ్చిన ప్రజలకు పట్టణానికి చెందిన ఎల్ఐసీ ఏజెంట్, చైర్మన్ క్లబ్ మెంబర్, చీఫ్ లైఫ్ ఇన్సూరెన్స్ అడ్వైజర్ పొత్తూరి నాగేశ్వరరావు ఉచిత భోజనాన్ని ఏర్పాటు చేశారు.



బాధితురాలి సమస్య వింటున్న ఎస్పీ రవిశంకర్‌రెడ్డి

ఉద్యోగం ఇప్పిస్తానని రూ.10 లక్షలు కాజేశారు

ఇంటర్ వరకు చదువుకొని ఉద్యోగం కోసం ప్రయత్నిస్తుండగా ఇంటి పక్కన ఉండే ఆమె ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పగా రూ.10లక్షలు ఆమెకు ఇచ్చాను. తరువాత ఆమె ఉద్యోగం చూపించకుండా, డబ్బులు ఇవ్వకుండా మోసం చేసింది.

– ఓ మహిళ, వినుకొండ

కుక్కల దాడిలో జింకకు గాయాలు

లచ్చన్నగుడిపూడి(తాడికొండ): నీటి కోసం వచ్చిన జింక కుక్కల దాడిలో గాయపడిన ఘటన తాడికొండ మండలం లచ్చన్నగుడిపూడిలో జరిగింది. మోతడక అటవీ ప్రాంతం నుంచి సోమవారం ఓ జింక నీటి కోసం వచ్చి కుక్కల బారిన పడింది. వెంటపడి కరుస్తుండటంతో గ్రామస్తులు కాపాడి, రెవెన్యూ అధికారుల ద్వారా అటవీ అధికారులకు సమాచారం అందించారు. మోతడక అటవీ ప్రాంతంలో తాగేందుకు నీరు లేకపోవడంతో జింకలు కొండ దిగి జనవాసాల్లోకి వస్తున్నాయని గ్రామస్తులు చెబుతున్నారు. అడవిలో నీటి గుంతలు ఏర్పాటు చేయాలని వారు అధికారులను ఎప్పటి నుంచో కోరుతున్నారు.

వ్యక్తిపై ఇనుపరాడ్డుతో దాడి



ఘటనా స్థలంలో కోటేశ్వరరావు

దాచేపల్లి: అనుమానం పెనుభూతమైంది. భార్యతో సన్నిహితంగా మాట్లాడుతున్నాడనే అనుమానంతో వ్యక్తిపై ఇనుపరాడ్డుతో దాడికి పాల్పడిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. ఎస్ఐ దాసరి శివనాగరాజు అందించిన వివరాలు.. నారాయణపురంలో నివాసం ఉంటున్న మారబోయిన కోటేశ్వరరావుకు నెలరోజుల కిందట వివాహం అయింది. అదే వీధిలో నివాసం ఉంటున్న బొమ్మనబోయిన శ్రీనివాసరావు భార్యతో కోటేశ్వరరావు సన్నిహితంగా ఉంటున్నాడనే అనుమానం కలిగింది. ఈ నేపథ్యంలో ఇంటి వద్ద ఉన్న కోటేశ్వరరావుతో శ్రీనివాసరావు, సోదరుడు నరసింహారావు, లక్ష్మి వాగ్వాదానికి దిగారు. వెంట తెచ్చుకున్న ఇనుపరాడ్డుతో కోటేశ్వరరావు తలపై పది సార్లు మోదారు. కోటేశ్వరరావును పిడుగురాళ్లలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. కోటేశ్వరరావు ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం గుంటూరుకు తరలించారు. ఘటనా స్థలాన్ని ఎస్ఐ శివనాగరాజు పరిశీలించి వివరాలు సేకరించారు. కోటేశ్వరరావు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దాడికి పాల్పడిన వారిలో ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.


24న సత్తెనపల్లిలో మెగా జాబ్‌మేళా

నరసరావుపేట: డిపార్టుమెంట్ ఆఫ్ స్కిల్ డెవలప్మెంట్ అండ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో రాష్ట్ర జలవనరుల మంత్రి అంబటి రాంబాబు సహకారంతో ఈనెల 24న సత్తెనపల్లిలో మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి కె.సంజీవరావు పేర్కొన్నారు. సోమవారం జాబ్‌మేళా పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్, జాయింట్ కలెక్టర్ ఏ శ్యాంప్రసాద్ ఆవిష్కరించారు. రఘురామ్‌నగర్‌లోని ప్రగతి కళాశాలలో ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4.30వరకు నిర్వహించే మెగా జాబ్‌మేళాను సత్తెనపల్లి నియోజకవర్గ పరిధిలోని నిరుద్యోగులు ఉపయోగించుకోవాలని కలెక్టర్ కోరారు. గ్రీన్‌టెక్ ఇండస్ట్రీ, హెటిరో డ్రగ్స్, వల్లభ మిల్క్ ప్రొడక్ట్స్, అపోలో ఫార్మసీ వంటి 17రకాల కంపెనీలు హాజరవుతున్నాయని తెలిపారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, బీటెక్, డిప్లొమా, ఫార్మసీ, పీజీ చదివిన 18ఏళ్ల నుంచి 45ఏళ్లలోపు వారు హాజరుకావాలని సూచించారు. వివరాలకు ఏ.రమ్య (83285 44388), ఫిరోజ్ గాంధీ(70139 50097), ఖాదర్ బాష (94409 88148)ను సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ బాలూనాయక్, డీడీఓ మహాలక్ష్మి పాల్గొన్నారు.

ఇదిగో మిల్లెట్స్ మెనూ..

మధుమేహం నియంత్రణకు అవకాశం

- జిల్లాలో పెరుగుతున్న షుగర్ వ్యాధిగ్రస్తులు
- చిరుధాన్యాలకు పెరిగిన ప్రాధాన్యం
- వెలుస్తున్న మిల్లెట్ ఫుడ్ కోర్టులు



సాక్షి, నరసరావుపేట: ఈ రోజుల్లో చిన్నాపెద్ద అనే తేడా లేకుండా అన్ని వయసుల వారు షుగర్ వస్తోంది. జీవనశైలిలో వచ్చిన మార్పులు ప్రధాన కారణంగా చెబుతున్నారు. ఒక్కసారి మనం షుగర్ బారిన పడ్డామంటే దానికితగ్గ మందులు వాడటం ఎంత ముఖ్యమో, తగిన ఆహార నియమాలు పాటించడం కూడా అంతే ముఖ్యం. జంక్ ఫుడ్‌ను ఇష్టపడే వారు కూడా హెల్త్ ఈజ్ వెల్త్ అంటూ పోషకాహారాలు ఉన్న మిల్లెట్ ఫుడ్ వైపు మొగ్గు చూపుతున్నారు. నగర, పట్టణవాసులు ఆసక్తి చూపుతున్నారు.

మిల్లెట్స్ ఫుడ్ వైపు మొగ్గు..

మధుమేహం, ఉబకాయం సమస్యలు ఉన్నోళ్లు తప్పనిసరిగా చిరుధాన్యాలను ఆహారంలో భాగం చేసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ఆరోగ్యంగా ఉండేందుకు, బరువును తగ్గేందుకు మిల్లెట్స్ వైపు మొగ్గు చూపుతున్నారని వైద్యులు చెబుతున్నారు. ట్రెండ్‌కు తగినట్లుగా కొందరు హోటళ్ల నిర్వాహకులు సరికొత్త థీమ్స్‌తో రెస్టారెంట్లను ప్రారంభిస్తున్నారు. తక్కువ ధరలోనే పసందైన మిల్లెట్స్ ఆహారాన్ని అందిస్తున్నారు. జొన్నలు, సజ్జలు, రాగులు, కొర్రలు, ఊదలు, సామలు, అరికెలు, వరిగలు వంటి చిరుధాన్యాలతో చేసిన ఇడ్లి, దోశ, వడ, ఉప్మా, పొంగల్ వంటి టిఫిన్లుకు డిమాండ్ పెరుగుతోంది.

వీధి వీధిలో మిల్లెట్ ఫుడ్ కోర్టులు...

గతంలో వీధిలో తోపుడు బండ్లపైన బజ్జీలు, గారెల వంటి అల్పాహార దుకాణాలు అధికంగా కనిపించేవి. మారుతున్న ఆహారపు అలవాట్లలో భాగంగా వీధుల్లో ప్రస్తుతం చిరుధాన్యాలతో చేసిన ఇడ్లి, దోశ, రొట్టెల బండ్లు దర్శనమిస్తున్నాయి. షుగర్ వ్యాధి కారణంగా చాలా మంది వరి అన్నం తినడం తగ్గించి, ఒక పూట జొన్నరొట్టెలు తింటున్నారు. దీంతో వీటికి ఆదరణ పెరిగింది. ఒకప్పుడు కిలో రూ.20కి లభించే కొర్రలు ఇప్పుడు రూ.70–90కు చేరాయి. ఇలా ఇతర చిరుధాన్యాల వినియోగం పెరగడంతో గిట్టుబాట ధర పెరిగి రైతులు పండించడం క్రమంగా పెరుగుతోంది. ఇందులో ఆర్గానిక్ పద్ధతిలో సాగు చేసే చిరుధాన్యాలను అధిక ధరలు వెచ్చించి మరీ కొనుగోలు చేస్తున్నారు.

అందరికి మంచిదే...



అన్నంలో కార్బోహైడ్రేట్స్ ఎక్కువ, ప్రోటీన్లు తక్కువగా ఉంటాయి. అదే చిరుధాన్యాలలో కార్బోహైడ్రేట్ల శాతం తక్కువ, శరీరానికి అవసరమైన విటమిన్లు, ప్రోటీన్లు ఎక్కువగా లభిస్తాయి. దీంతో మధుమేహ వ్యాధిగ్రస్తులు చిరుధాన్యాలను తీసుకోవడం మంచిది. ఐతే చిరుధాన్యాలు మధుమేహం లేని వారు సైతం వినియోగించడం ఉత్తమం, దీని వల్ల రోగాల బారిన పడకుండా ఆరోగ్యంగా ఉంటారు. ఈ ఉద్దేశంతోనే ప్రభుత్వం విద్యార్థులు, రోగులకు రాగిజావను అందజేస్తోంది.

– డాక్టర్ బీవీ రంగారావు, ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్, పల్నాడు జిల్లా

విజయవాడ డివిజన్‌లో రూ.6212.39 కోట్ల వ్యాపారం

కరూర్ వైశ్యా బ్యాంక్ డివిజనల్ మేనేజర్ ప్రసాద్



కరూర్ వైశ్యా బ్యాంక్ సత్తెనపల్లి శాఖను ప్రారంభిస్తున్న ఆర్డీఓ రాజకుమారి

సత్తెనపల్లి: కరూర్ వైశ్యా బ్యాంక్ విజయవాడ డివిజన్ 2023 మార్చి 31 నాటికి రూ. 6212.39 కోట్ల వ్యాపారం చేసిందని ఆ బ్యాంక్ డివిజనల్ మేనేజర్ కె.వి.ఎస్.ప్రసాద్ చెప్పారు. శాఖల విస్తరీకరణలో భాగంగా పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణంలో 803వ శాఖను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బ్యాంకు డివిజనల్ మేనేజర్ ప్రసాద్ మాట్లాడుతూ తమ డివిజన్ పరిధిలో ప్రస్తుతం 52 శాఖలు ఉన్నాయని, సత్తెనపల్లి శాఖతో ఆ సంఖ్య 53కు చేరిందని తెలిపారు. బ్యాంక్ 191లో రూ.లక్ష మూల ధనంతో స్థాపించబడిందన్నారు. 2023 మార్చి 31 నాటికి అది రూ.160.41 కోట్లకు చేరుకుందని, రూ.1106.09 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసిందని వివరించారు. డివిజనల్ ఆపరేషన్ ఆఫీసర్ ఐ.వి. సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ కేవీబి డిజిటల్ బ్యాంకింగ్ సేవల్ని సత్తెనపల్లి పరిసర ప్రాంత ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. ముందుగా కరూర్ వైశ్యా బ్యాంక్ నూతన శాఖను, ఏటీఎంను సత్తెనపల్లి రెవెన్యూ డివిజనల్ అధికారి బి.ఎల్.ఎస్. రాజకుమారి ప్రారంభించారు. జ్యోతి ప్రజ్వలన ఏరియా వైద్యశాల వైద్యురాలు వై.వి. సుజాత చేపట్టగా, బ్యాంకు సేఫ్ రూంను చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు ప్రారంభించారు.

పిడుగు పడి గొర్రెల కాపరి మృతి

గురజాల: పిడుగుపడి గొర్రెల కాపరి మృతి చెందిన సంఘటన సోమవారం మండలంలో చోటుచేసుకుంది. మాడుగుల గ్రామానికి బత్తుల రాజు (35) సోమవారం మధ్యాహ్నం పొలంలో మేకల కాస్తుండగా ఉరుములతో కూడిన వర్షం కురిసింది. ఈ సమయంలో పిడుగు రాజుపై పడటంతో అక్కడిక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గురజాల సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.